# బండల నడుమ

బి. సి. ఎచ్. శేఖర్

బండలమధ్య వేళ్ళమీద లెక్కబెట్టగలిగినన్ని గుడిసెలున్న అదొకచిన్న పల్లెటూరు. వూరుఅంటంగూడా బాగుండదని నా అభిప్రాయం. ఆ కొండలమధ్య (గుడిసెల్ని ఎవరికివారు కొంపలంటుడంట అక్కడి 'అలగా' జనానికి అలవాటు) ప్రతిరోజులాగే (చంద్రుడొస్తేతప్ప) ఆరోజుకూడా చీకటితాండవిస్తోంది. చలిగాలి దరిద్రానికి తోడై వీస్తుంది.

దాదాపు అర్ధరాత్రిదాటింది.

"ఒరేయ్ ఎంకయ్యా ! లేరా లే !"

ఎంకయ్య ఆ కేకతో ఒక్కసారి గాఢనిద్రనుండి ఉలిక్కిపడి లేచికూర్చుని కళ్ళు నులుపుకుందేంతలో ఆ అరుపులాంటికేక పేరుమార్పుతో దూరమయింది.

పెళ్ళానికి పాముకరిచిందన్నా, నాలుగేళ్ళకొడుకు నిద్రలో నీలుక్కుపోయాడన్నా, ఇంట్లోకి కుక్కజొరబడి రాతెండిగిన్నెలు చప్పుడుచేస్తున్నా, పందికొక్కులు ఇంట్లో బొరియలు తవ్వుతున్నా, ఆఖరుకు కుక్కవచ్చి తనపక్కలో పడుకున్నా ఏ రాత్రి అతను నిద్రలేవలేదు. పక్కలోపడుకున్న కుక్కనుకరుచుకొని మరింత వెచ్చదనాన్ని అనుభవిస్తాడు.

అలాంటి ఎంకయ్య ఈ కేకవినగానే ఉలిక్కిపడి లేవకతప్పలేదు. ఆ కేక అతనిజీవితంలో అతిముఖ్యమైనది సుపరిచితమైనది. ఆకేకకు అర్థమేమిటో అతనికి బాగాతెలుసు. తెలుసుకనుకనే అతనికాళ్ళు నీళ్ళకుండదగ్గరికి పోయాయి నీళ్ళతో మొహాన్నికడుక్కుని కళ్ళునులుపుకుంటూ చినిగిన తనకున్న ఒకేఒక నల్లటిపంచె (మట్టిఅంటుకుని నల్లబడిన) తలకుకట్టుకుని దరిద్రంతినేసిన చెప్పులజతని కాళ్ళలోకి బలవంతంగాదూర్చి నిద్రపోతున్న తన నాలుగేళ్ళ చిన్నారికొడుకుని ఒకసారిచూసి నిర్వంగానిట్టూర్చి బయటకు అడుగులువేశాడు ఎంకయ్య.

బయట చలిపెడుతున్నబాధ అతని దరిద్రంకంటే భయంకరమైనది కాదుగాబట్టి అది తనదరిద్రంలో ఒకభాగమని తెలుసుకాబట్టి చిన్నగా వణుకుతూ నడుస్తున్నాడు.

ఎంకయ్య ఒకచిన్న నాపరాయిగనిలో కార్మికుడు. గనిలోబానిసంటే సహజంగా ఉంటుందేమో ! అతనితోపాటు ఓ వలభైమంది ఆ గనిలో పనిచేస్తారు. పొద్దుటే గనిలోకివెళ్ళి రాళ్ళనుతొలిచి అడుగుకి కొంతడబ్బు కూలీతీసుకుంటుంటారు. రాత్రిపూట

డకు ఆరేడుమైళ్ళదూరంలోవున్న పట్టణంలో నివసిస్తుంటాడు. వారాంతంలో అక్కడికి వెళ్ళి బట్వాడా తీసుకుంటారు. ఇబ్బందులకు యజమానివద్ద ఎంతోకొంత అప్పుతీసుకున్నవారే. అప్పుమాత్రం ఎవరూ తీర్చలేకపోతున్నారు. వడ్డీతో రెండింతలౌతుంది.

అప్పటికే ఆ లారీదగ్గర కొన్నిచుట్టలు ఎర్రగా కాలుతున్నాయి. మట్టిలోపుట్టి మట్టిలోపెరిగిన నల్లటి మనుషుల్నిమాత్రం ఆ చీకటి మింగేస్తుంది. చిన్నగా వాళ్ళ దగ్గరికిపోయి తనూ ఓచుట్ట వెలిగించాడు. రావలసినవాళ్ళకోసం ఎదురుచూస్తూ ఆలోచనలో పడ్డాడు.

'తను పుట్టిందిపెరిగింది ఇప్పుడు శ్వాసపీలుస్తూ విడుస్తుందీ ఈ రాళ్ళమధ్యనే సంపాయించింది రోగాలు, రొప్పులూ రాళ్ళదెబ్బలూ. ఈ రాళ్ళమధ్యనే తనభార్య ప్రాణంపోగొట్టుకుంది పాముకరిచి. ఈ రాళ్ళమధ్యనే తనకొడుకు అక్షరంముక్క నేర్చుకోడానికి నోచుకోలేకపోయాడు. ఈ రాళ్ళమధ్యనే తనుఅప్పుతో పదిముళ్ళు వేయించుకున్నాడు. ఇక్కడ్నించి వెళ్ళిపోదామంటే అప్పుతీర్చాలి. తను అప్పుతీర్చలేడు. కాబట్టి తనుబలవంతంగా ఈ రాళ్ళమధ్యకు తోయబడుతున్నాడు. ఈ రాళ్ళమధ్యనేవున్న తనగూటిలోనికి కనీసం చలిచొరనీయకుండా చేయలేకపోతున్నాడు. అన్నాన్ని కుక్కలపాలు చేస్తున్నాడు'.

"రండెహె తొరగాకానీయండెహె మీయవ్వారాలు, సందుదొరికితే గుసగుసలు".

ఎంకయ్య ఆలోచనలను భగ్నంచేస్తూ మేస్త్రీకేకలు సగంకాలినసుట్టను ఇంకో దమ్ములాగి ఆర్పి భద్రంగా బొడ్లోపెట్టుకుని నాపరాళ్ళవేపు అడుగులువేశాడు అందరిలాగే. ఇద్దరు కార్మికులసాయంతో ఓబండ నెత్తిమీదకెత్తుకున్నాడు. అడుగులు లారీవేపు పడుతున్నై. మనసుని ఆలోచనలు పీకుతున్నై.

'తనెందుకిలా వున్నాడు ?

ఎందుకు ?

ఎందుకు ?

దానికి కారణంఎవరు ?

యజమానా ?

దేవుడా ?

చట్టమా ?'

643

"అబ్బా" ఒక్కగావుకేక, రాయిపడి కాలివేలు చితికిపోయింది. అందరూ

"ఒరేరంగన్నా ఇంతకిరసనాయిలు ఇటుతేరా" వెంటనే వెలుగుతున్న దివిటీ లాంటి బుడ్డిలోంచి ఇంత కిరసనాయిలు ఎవరో కాలివేలుమీద పోశారు, పైపంచె లోంచి ఒక పేలికను కట్టుగాకట్టారెవరో. కిరసనాయిలుతాకిడికి తీవ్రంగా తీపుపుడు తోంది ఎంకయ్యకాలు".

"ఇంటికెళ్ళి పండుకోరా ఇయ్యాల్టికి నువుపనిసెయ్యలేవు ?" ఒకగొంతు ఆప్యాయంగా సలహాయిచ్చింది.

అతనిచ్చినసలహాలో 'ఇయ్యాల్టికి' ఆప్యాయతతో కూడుకున్న మాటేగానీ వ్యంగ్యార్థంలోకాదు- అదే పున్నోళ్ళకు ఇంతదెబ్బతగిలితే ఎన్ని రోజులు డాక్టరు వాళ్ళింటికితిరుగుతాడో, ఎంతమంది బంధువులో లెక్కబెట్టలేము. కానీ అతని జీవితంలో అలాంటిదెబ్బలు లెక్కలేదు. పలుకరించేదెవరు. అందుకే "పనిచెయ్యక పోతే రేపుతిండెట్ట ?" మనసుప్రశ్నించింది.

"పనెలాచేస్తావో నేంచూస్తాను ?" కాలికున్నదెబ్బ నొప్పిరూపంలో ప్రశ్నించింది.

బాధ ! నొప్పి ! రేపు ! తిండి !

'అబ్బా !' 'అమ్మా !' మూలుగుతూ గుడిసెవేపు కుంటుతూ నడిచాడు ఎంకయ్య

X X X X

మనుషులచర్మాన్ని నల్లగామార్చాలనే దురుద్దేశం ఉందికాబోలు ఎండ మండి పోతోంది. బండలు కొలిములోకాల్చిన ఇనుపకడ్డీల్లా మాడిపోతున్నై. ఆ ప్రదేశ మంతటా పులులు, సుత్తులు టకటకలాడుతున్నై. అవితప్ప మరేమీ విన్పించటం లేదు. ఎంకయ్యకూడా పులితో నాపరాళ్ళను తొలుస్తున్నాడు. ఎంకయ్య కొడుకు నాలుగేండ్లవాడు ఒక బండచాటునీడలో ప్రపంచం తనకేమీ పట్టనట్లు సుఖనిద్ర (రాళ్ళలో) పోతున్నాడు. అన్నంతట్ట, నీటికుండ వాడికికొంచెం అవతలవున్నై. ఎంకయ్యకాలు బాగావాచివుంది. అయినా పనిలోకి రాకతప్పలేదు. కారణం తిండి.

నల్లగావున్న చొక్కాలాంటి అతనిశరీరంపైపడిన ఎండని చర్మంశోషణచేస్తుంది. అతనికడుపులో ఆకలి. చిన్నగాలేచి తలగుడ్డయిప్పి ఒక్కసారి విదిలించాడు. దుమ్ము ఆ ప్రదేశంలో బాగాఅలుముకుంది. పులి సుత్తి ఒకరాయిచాటునపెట్టి, తిరిగివచ్చి గడ్డపార వాటిపక్కనేవుంచి కొడుకుదగ్గరికి వచ్చాడు.

644

వాణ్ణి నిద్రలేపి కాస్తంతఅన్నంకలిపి వాడికిపెట్టి తనూతిన్నాడు. అన్నం ఎర్రగావుంది. కడుపులోమంటగావుంది. కుండలోనీళ్ళువంచి వాడికితాపి తనూతాగాడు.

చెయ్యికడుక్కొని తలగుడ్డకు తుడుచుకున్నాడు. బొడ్లోంచి సగంకాలినచుట్టను వెలిగించాడు. కొడుకు మళ్ళీనిద్రలోకి జారుకోబోతున్నాడు. రెండుదమ్ములుపీల్చి పొగ వదిలాడు.

"ఏమయ్యోయ్" ఎవర్నీ అన్నట్లుగా కేకవేసిన మనిషివేపు చూశాడు ఎంకయ్య పంచె కట్టిన అపరిచితుడు అల్లంత దూరంలో నిలబడి పిలుస్తున్నాడు.

"నిన్నే మా అయ్యగోరు రమ్మంటున్రు."

"ఎవరా అయ్యగోరు? ఎక్కడవుండు" అని తిరుగు ప్రశ్నలెయ్యలేదు ఎంకయ్య. ఎవరైతేనేం 'అయ్యగోరు' అంటున్నాడు కాబట్టి అతని మెదడు ప్రశ్నించమని నోటికి చెప్పలేదు కాళ్ళకు వచ్చినతనివెంటనడవమని ఆజ్ఞ యిచ్చింది. కొడుకు నెత్తుకోని కుంటుతూ అతన్ని అనుసరించాడు ఎంకయ్య.

కొంచం దూరంలో ఒక చెట్టుకింద మోటారు సైకిల్‌పై కూర్చొని వున్నాడొక మనిషి పాంటుషర్టు ఖరీదైనవని తెలుస్తూంది. నడివయస్కుడు.

"అయ్యగోరు మీ లేబరాపీసరు. చాలా దయగలవోడు. పేదలంటే చెడ్డ అబిమానం ఆనకి" దూరంగా వుండగనే చెప్పాడు ఎంకయ్యని పిలుచుకొస్తున్న వ్యక్తి.

ఎంకయ్య లేబరాఫీసరు నెప్పుడూచూశ్శేదు. ఎవరో అనుకుంటుంటే కాబోలు ఇన్నాడతను. యజమానులు బ్రాందీ, విస్కీలు, కోళ్ళు, కుక్కలతో లేబరాఫీసర్లని మచ్చికచేసుకుంటారని.

"మరీన యీడి కెందుకొచ్చినట్టబ్బా" ఆలోచించాడు. 'అసుంటి బాందీలకు లొంగేఓడు కాదేమో' మనసు సమాధానపరిచింది.

"దండాలు బాబుగోరు" పిల్లగాణ్ని బుజంమీద నుండి దింపి వినయంగా చేతులు జోడించాడు ఎంకయ్య.

"నీ పేరేంటిరా?"

"నా పేరు ఎంకయ్యండి తమరు ఎంకన్న అనండి".

"నువ్వు ఈ క్వారీలోనే పనిచేస్తుంటావా?"

"ఔను ఈ కోరీలో నేనండి"

"మీ యజమాని మంచోడేనా?"

645

"...................." చెప్పడానికి సందేహించాడు చెపితే ఏంగొడవో చెప్పకపోతే ఏంగొడవో తేల్చుకోలేక తలొంచుకుని నిలబడ్డాడు ఎంకయ్య.

"పర్లేదు నిజంచెప్పు. నేను మీ లేబరు మేలుకోరేవాణ్ణే, మంచోడు కాదని విన్నాను. మీకు మేలుచేద్దామని వచ్చాను చెప్పురా చెప్పు."

"నిజమేనండి మంచోడు కాదండి" తడపడుతూ సమాధానం

"ఎందుకని?" మోటారుసైకిల్ ప్రశ్న. ఒక కాగితం కలం తీసుకుని ఎంకయ్య చెబుతున్నది రాసుకుంటున్నాడు.

"మాకు బట్వాడా సరిగా యియ్యడండీ. మాకేదన్నా దెబ్బ తగిలిందనుకోండి. లేబరురూలు పకారం వారే డబ్బులియ్యాలంట కదండి. ఈన అట్టాకాదండి మేం దెబ్బ నయం సేయించుకోడానికి డబ్బులు వడ్డీకిచ్చి తీర్సేందాక పాణాల్తీస్తడండి. రాతిరే నాకాలికి దెబ్బతగిలిందండి" దెబ్బవేపు చూపించాడు. ఎంకన్నకు లేబరాఫీసరు మీద గురి కుదిరింది. "ఇంకా సెప్పాలంటే శానావున్నయండీ. మా గూడేనికి బడిలేదండి"

"మరి మీ పిల్లలెలా చదువుకుంటున్నారు?"

"సదువూసందే ఏదీలేదండి. సదువే కాదు బుద్ద దాకటరుబాబు కూడా లేడండి. అందుకే మా ఆడది పాముకరిసి సచ్చిపోయిందండీ. దాకిటేరుంటే బతికేదేనని అందరూ అన్నారండి."

"అయ్యోపాపం" రాస్తున్న కలాన్ని ఆపకుండా అన్నాడు లేబరాఫీసరు.

"మీకు లేబర్‌యాక్టుప్రకారం బడి, హాస్పిటల్, ఏదైనా దెబ్బతగిలిందంటే ఉచితచికిత్స ఇవన్నీఉండాలి. ఈ కాగితంమీద సంతకంపెట్టు అవన్నీ వచ్చేఏర్పాట్లు చేస్తా".

"సంతకంరాదండి. ఏలుముద్దరేత్తానండి".

వేలిముద్ర వేసింతర్వాత మోటారుసైకిల్ దూసుకునిపోయింది.

పడమట సూర్యుడు సంధ్యారాగం ఆలాపిస్తున్నాడు, ఆకాశం ఎర్రగా కంది నట్లుంది. లేబరాపీసరుగురించి ఆలోచిస్తున్నాడు, ఇంటివేపునడుస్తూ ఎంకయ్య.

'శానామంచోడు, దరమాతుముడు పిల్లగాడికి సదూసెప్పించొచ్చు' తనవెంబటి వొస్తున్న కొడుకువేపొకసారిచూశాడు వాడాఫీసరై పోయినట్లు.

'ఏదైనా దెబ్బతగిలితే పసర్లుకాకుండా ఇంగిలీసుమందులేపియ్యొచ్చు' ఆలోచిస్తూ ఇల్లుచేరుకున్నాడు.

మట్టికొట్టుకున్న శరీరం- మట్టిలోపొర్లాడిన బట్టలు జీవితమంతామట్టేసుత్తి, వులి, తట్ట ఒకమూల్నపెట్టి మొహంకడుక్కుందామని కుండదగ్గరకు వెళ్ళాడు. కొడుకు దూరంగా ఆడుకుంటున్న పిలలవేపువెళ్ళాడు.

646

ఏదో మోటర్ సైకిల్ మోతవినిపించింది. బయటికొచ్చి చూశాడు- మోటర్ సైకిల్ వెంకయ్య యింటిముందాగింది-

ఈ మోటర్ సైకిల్ మధ్యాన్నం వచ్చిందికాదు. దానిమీదున్నవ్యక్తి యజమాని జోగారావ్- బుర్రమీసాలు గ్లాస్కోపంచె. తెల్లటిఖరీదైనలాల్చి- భారీవిగ్రహం.

"ఒరేయ్ ఎంకన్నగా ఇట్రారా" బలవంతంగా తెచ్చిపెట్టుకున్న శాంతంతో అంటున్నపిలుపు. ఎంకన్న మోటార్ సైకిల్ దగ్గరగావెళ్ళాడు.

"ఏందిరా నువ్వుచేసింది- ఇదేనారా" లాల్చిజేబులోంచి కాగితం బయటికి తీసింది బుర్రమీసాలచెయ్యి.

"ఇదేంటో చదువురా" మీసాలు గర్జించినయ్.

"నాకు సదువురాదు బాబయ్యగోరూ" అమాయకుడిపలుకు-

"నాయాలా చదువురానోడివి ఈ స్టేట్మెంటెలాగిచ్చినవ్‌రా- చదువురానోడివి అలాగే ఉండకూడదురా" చెప్పలేని యింకాఎన్నోమాటలు మాట్లాడుతూ మోటార్ సైకిల్ గర్జించింది.

"అబ్బా" దిమ్మ తిరిగింది ఎంకన్నకు కళ్ళు గిర్రున తిరిగినై. మోటారుసైకిల్ తల్లకిందులైనట్లు కన్పడుతుంది.

"ఫట్ ఫట్" బూటులతో దెబ్బలు

"అబ్బా" పక్కనున్న గోడకు కొట్టుకొని కిందపడిపోయాడు. తలకు దెబ్బ.

రక్తం.... రక్తం.... రక్తం....

మొహం ఎర్రగా మారిపోయింది. బట్టలు మట్టితోపొర్లాడుతున్న బట్టల్లోకి రక్తం ప్రవహించి తడిసిపోయినై.

"నాయాలా ఇదే నీకు చాలదురా ఎంత పాపం దలిచినా మీ అలగాబుద్దులు పోవురా బడొందలిచ్చి ఈ కాగితం విడిపిచ్చుకునేసరికి తలప్రాణం తోక్కొచ్చింది. ఆ లేబరాపీసరుగాడు బవొందలకేలొంగిండు. లేకపోతే సీపీక పిసికేవాణ్ణి దొంగలంజా కొడకా...."ఇంకా ఏదేదో అంటుంది బుర్రమీసాలతో కప్పబడ్డ భోషాణంలాంటి నోరు.

ఇంకేమీ విన్పించడంలేదు ఎంకయ్యకి స్పృహతప్పుతోంది నాడులు పనిచెయ్యడం ఆపేస్తున్నై.

వెళ్ళిపోతున్న మోటారుసైకిల్ చప్పుడులో యజమాని తిట్లు [illegible]దార్ ఆఫీసరు తీయటిమాటలూ కలిసిపోయి ఒకేలాగ అన్పిస్తున్నయ్ ఎంకయ్యకు, స్పృహతప్పుతున్న ఎంకయ్యకు ఏదో కొత్త స్పృహ....